# బీసీ రిజర్వేషన్ సాధిస్తాం

- నేటి తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన పార్టీలు, ఉపాధ్యాయ, ప్రజా, కుల సంఘాలు

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను సాధించేదాక సీపీఐ పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్ అన్నారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రాల్లో పార్టీశ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**బంద్‌తో బీసీల సత్తా చూపిస్తాం**

**మెట్టుగడ్డ:** బంద్‌ను విజయవంతంగా నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బీసీల సత్తా చూపిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ బెక్కం జనార్దన్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మున్నూరు రాజు, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్, రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బంద్‌ను విజయవంతం చేయాలి**

బీసీ సంఘాలు శనివారం నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్ చందుయాదవ్, యాదవ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకానీ బాలుయాదవ్,రజక సంఘం సంపూర్ణ మద్దతిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గేశ్, ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా కన్వీనర్ నరసింహ తెలిపారు.

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ బీసీ సంఘాల బంద్‌కు సంపూర్ణ మద్దతు పలుకుతున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ వేర్వేరు ప్రకటనలలో తెలిపారు.



బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు



మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

**దేవరకద్ర:** బీసీ సంఘాలు తలపెట్టిన బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాల ని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బంద్‌లో పాల్గొనాలని కోరారు.

**జడ్చర్ల టౌన్:** బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి శుక్రవారం ఓప్రకటనలో తెలియజేశారు. బంద్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సైతం బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**గండేడ్:** బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని పలువురు రాజకీయ పార్టీల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు ఆయా పార్టీలకు చెందిన నాయకులు జేఏసీ ఆధ్వర్యంలో బంద్‌పై సమీక్షించారు. బీసీలకు మద్దతుగా పెద్దఎత్తున ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**నవాబుపేట:** బీసీల రిజర్వేషన్ల సాధనకు శనివారం తలపెట్టిన బంద్‌కు అన్నిపార్టీలు మద్దతును ఇచ్చాయి. శనివారం జరిగే బంద్‌లో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనే అవకాశం ఉందని, ఇప్పటికే అన్ని పార్టీలు తమ సోషల్ మీడియాలో బంద్‌ను విజయవంతం చేద్దామంటూ ప్రకటనలు జారీ చేశారు.

**అడ్డాకుల:** బీసీల రిజర్వేషన్ల సాధనకు శనివారం చేపట్టే బంద్‌ను అందరూ కలిసి విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ మండల అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్ కోరారు.

**ఉపాధ్యాయ సంఘాల మద్దతు**

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** రాష్ట్ర వ్యాప్త బంద్‌కు జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని మోడల్‌బేసిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు.

**స్టేషన్ మహబూబ్‌నగర్:** బీసీ రిజర్వేషన్ల కోసం శుక్రవారం చేపట్టిన తెలంగాణ బంద్‌కు మిల్లీ మహాజ్ మహబూబ్‌నగర్, ముస్లిం లీగ్ మద్దతు తెలుపుతున్నట్లు మహాజ్ కన్వీనర్ తఖీ హుస్సేన్, లీగ్ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సాధిక్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మిల్లీ మహాజ్ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు.

**మహమ్మదాబాద్:** బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలా అధ్యక్షుడు కేఎం నారాయణ, బీఆర్ఎస్ అధ్యక్షుడు బిక్షపతి, బీజేపీ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు. అన్ని కులాల వారు పాల్గొని మద్దతు తెలపాలని కోరారు.

**మెట్టుగడ్డ:** బీసీ బంద్‌కు అఖిల భారత యాదవ మహాసభ సంపూర్ణ మద్ధతు తెలుపుతున్నామని సభ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్ పేర్కొన్నారు. యాదవ సమాజం పెద్దఎత్తున బీసీ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## బీసీ నాయకులు తరలిరావాలి

**మహబూబ్‌నగర్ రూరల్:** బంద్‌ను విజయవంతం చేయడానికి అందరూ తరలిరావాలని జాతీయ ఎంబీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖరాచారి, ప్రధాన కార్యదర్శి కిన్నెర శేఖర్ ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని కులవృత్తులు, చేతి వృత్తులువారు, వ్యాపార, కార్మిక, ఆర్టీసీ యూనియన్, ఆటో యూనియన్, పెట్రోల్ పంపు యజమానులు, విద్యాసంస్థల యజమానులు సంపూర్ణ మద్దతిచ్చి బంద్‌కు సహకరించాలని కోరారు. శనివారం తెల్లవారుజామున 5గంటలకు జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## కామారెడ్డి డిక్లరేషన్ హామీని అమలు చేయాలి

- నేటి బంద్‌ను విజయవంతం చేద్దాం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా చట్టసవరణ చేసి 42శాతం బీసీ రిజర్వేషన్ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. జీవో ప్రకారం రిజర్వేషన్ సాధ్యం కాదని పార్టీ తరఫున చెప్పినా ప్రభుత్వం వినలేదని, బీఆర్ఎస్ చెప్పినట్లే జరిగిందన్నారు. స్థానిక సంస్థలో అయినా రిజర్వేషన్ ఉంటే రాజకీయంగా బీసీలకు సముచిత స్థానం వస్తుందన్నారు. విద్య, ఉపాధిరంగాల్లో కూడా రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాలు ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ బంద్‌లో అన్నివర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. బంద్ ఉన్నందున్న ఆర్టీసీ బస్సులను బయటికి తీయకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, వ్యాపార సంస్థలు బంద్‌లో పాల్గొనాలి. 42శాతం రిజర్వేషన్ సాధించే విధంగా పోరాటం సాగిస్తామని, ప్రతిఒక్కరూ పోరాటానికి సహకారం ఇవ్వాలని కోరారు. శుక్రవారం బంద్‌కు పార్టీశ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉదయం 5గంటలకు కొత్త బస్టాండ్ వద్దకు పార్టీ శ్రేణులురావాలని కోరారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, సీనియర్ నాయకులు శివరాజు, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, నరేందర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



బంద్‌ను విజయవంతం చేద్దామని నినాదాలు చేస్తున్న మాజీ మంత్రిశ్రీనివాస్‌గౌడ్, పార్టీ శ్రేణులు

## హిందూదేశంగా చేయాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్

**జడ్చర్ల టౌన్:** ఆర్ఎస్ఎస్ హిందూదేశంగా చేయాలని చూస్తుందని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని చంద్రగార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘటన్ సృజన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్ష స్థానంపై అభిప్రాయసేకరణ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

**నవంబర్ 29న సీఎం రాక**

బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ఇబ్బందులు లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి**

పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాచాటాలని, ప్రతిగ్రామంలోనూ విజయకేతనం ఎగురవేయాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

**కార్యకర్తల మనోగతం వెల్లడించాలి**

జిల్లా అధ్యక్ష పదవి ఎవరు బాగుంటారనే విషయాన్ని కార్యకర్తలు, నాయకులు మనోగతాలను వెల్లడించాలని ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ నారాయణస్వామి సూచించారు. మీ మనోగతాలకు అనుగుణంగానే జిల్లా అధ్యక్షుడి నియామకం ఉంటుందని, అర్హత ఉంటే మీరే ఆ పదవి ఆశించవచ్చన్నారు. మరో పరిశీలకురాలు షాకీర్ మాట్లాడుతూ.. పార్టీలోనే అనేక సంస్కరణలు వచ్చాయని, పనిచేసేవారికి తప్పనిసరిగా గుర్తింపు వస్తుందన్నారు. రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్ మాట్లాడుతూ.. పనిచేసేవారికి పెద్దపీట వేసేందుకు ఇలా అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు.

## క్లుప్తంగా

### మాజీ సర్పంచ్‌కు పరామర్శ



**నవాబుపేట:** మండలంలోని యన్మన్‌గండ్ల మాజీ సర్పంచ్ హన్మంత్‌ను మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఒక ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితుడిని మండల నాయకులతో కలిసి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, రఘు, హన్మంత్ నాయక్, ప్రతాప్, చెన్నయ్య, సంతోష్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

**కోడ్గల్‌యాదయ్యకు సన్మానం**

**జడ్చర్ల టౌన్:** వెల్ ఎడ్యుకేషన్ పీస్ కౌన్సిల్ ద్వారా డాక్టర్ అవార్డు పొందిన జెడ్పీ మాజీ చైర్మన్ కోడ్గల్ యాదయ్యను మాజీ మంత్రి లక్ష్మారెడ్డి శుక్రవారం సాయంత్రం శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మురళి, ప్రణీల్ చందర్, శంకర్‌నాయక్, ఇంతియాజ్, రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహులు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

### శిశుగృహ చిన్నారులపై ప్రత్యేక దృష్టి అవసరం



**పాలమూరు:** చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతూ వైద్యులతో ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సదరు సిబ్బందిని న్యాయమూర్తి ఇందిర సూచించారు. జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ దగ్గర ఉన్న స్టేట్ హోం, శిశుగృహాలను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఇందిర సందర్శించారు. స్థానికంగా ఉన్న వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. శిశుగృహాలో ఉన్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ఆ తర్వాత స్టేట్‌హోంలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో పలు రకాల చట్టాలపై అవగాహన కల్పించారు.

### జీపీఓ అధికారుల కేటాయింపు

**మిడ్జిల్:** మండలంలోని అన్ని జీపీలకు గ్రామపరిపాలన అధికారులను కేటాయించినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. ప్రజలకు ఏమైనా ధ్రువపత్రాలు అవసరం ఉంటే జీపీఓలను సంప్రదించాలని సూచించారు. కొత్తపల్లి, బైరంపల్లి, చేద్‌ఘాట్ తండాకు పాండురంగయ్య, వల్లభ్‌రావుపల్లి, వస్పులకు వాహిద్, మున్ననూర్, వెలుగోమ్ముకు కురుమూర్తి, బోయిన్‌పల్లికి కృష్ణయ్య, మిడ్జిల్, వాడ్యాల్‌కు కొండయ్య, దోనూర్, సింగందొడ్డి, కంచనపల్లికి కుర్మయ్య, వేములకు బాషా, కొత్తూర్‌కు రాజన్నను కేటాయించినట్లు తెలిపారు.

### సీపీఎం నాయకుల అరెస్టుకు నిరసన

**జడ్చర్ల టౌన్:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాజ్‌భవన్ ముట్టడిలో భాగంగా సీపీఎం నాయకులను అరెస్టు చేయటంపై శుక్రవారం పట్టణంలోని సిగ్నల్‌గడ్డపై ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతో సహా అన్నిపార్టీలు బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపి ఢిల్లీలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుండా డొంకతిరుగుడు వ్యవహారాలకు పాల్పడుతుందని ఆరోపించారు. గవర్నర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న తమ నాయకులను అరెస్టు చేయడం సబబుకాదని, భేషరతుగా వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాయిలు, లక్ష్మీదేవి, శంకర్, యాదయ్య, శ్యాంసుందర్, శివమ్మ, కరుణాకర్, మహేశ్ పాల్గొన్నారు.

### కేవైసీ చేయించుకోవాలి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** రెండేళ్లకుపైగా ఎలాంటి లావాదేవీలు జరపని ఖాతాదారులు తమ కేవైసీ పత్రాలు వెంటనే సమర్పించి ఖాతాను అప్‌డేట్ చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీబీ) రీజినల్ మేనేజర్ షీలా శుక్రవారం ప్రకటనలో తెలిపారు. క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లను తీసుకోవాలని కోరారు. పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లను డీఈఏ ఫండ్‌కు ఆర్‌బీఐ బదిలీ చేసిందన్నారు. ఖాతాదారులు లేదా మరణించిన డిపాజిటర్ల చట్టపరమైన వారసులు ఏదైనా శాఖలో అవసరమైన పత్రాలను సమర్పించి ఈ మొత్తాలను తీసుకోవచ్చన్నారు.

### కారు బోల్తా: వ్యక్తికి గాయాలు

**నవాబుపేట:** కారు బోల్తాపడి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో చోటు చేసుకుంది. శుక్రవారం కొందుర్గు మండలం శ్రీరంగాపూర్‌కు చెందిన ఖాజా(33) జిల్లా కేంద్రం నుంచి తన సొంత గ్రామానికి వెళ్తుండగా.. మార్గమధ్యలో యన్మన్‌గండ్ల సమీపంలో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీ కొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఖాజాకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు బాధితుడిని 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర

**గండేడ్:** సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని దేవరకద్ర మెడికల్ ఆఫీసర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బీసీ హాస్టల్, విశ్వభారతి కళాశాలలో సీపీఆర్, పొగాకు వాడకంపై వచ్చే అనర్థాలపై గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, వార్డెన్ కృష్ణ, సూపర్‌వైజర్ పుష్పవేణి, యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, ఎంటీటీ సిబ్బంది మహబూబ్‌పాషా, అక్బర్ పాల్గొన్నారు.

**వాగ్దేవీ జూనియర్ కళాశాలలో**

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ జూనియర్ కళాశాలలో సీపీఆర్‌పై రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ నటరాజ్ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో నర్సింహ, బాబుల్‌రెడ్డి, అశ్వనీచంద్రశేఖర్, కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, షాకీర్ పాల్గొన్నారు.

**సీపీఆర్‌పై అవగాహన**

**మిడ్జిల్:** ఆకస్మికంగా గుండెనొప్పి వచ్చిన వారికి సకాలంలో సీపీఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, వైద్య సిబ్బంది సునంద, ప్రసాద్, దేవయ్య, జంగయ్య, గీత, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలి

**స్టేషన్ మహబూబ్‌నగర్:** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీ రిజర్వేషన్‌ను ముందుకు తీసుకెళ్తుంటే కొన్ని దుష్టశక్తులు ఆపాలని ప్రయత్నాలు చేస్తున్నాయని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. రిజర్వేషన్ కోసం నేడు జరిగే తెలంగాణ బంద్‌లో జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఉదయం నుంచి ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ నాయకుడు మైత్రి యాదయ్య మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కాని బీజేపీ ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చడం లేదని ఆరోపించారు. బంద్‌లో ప్రతిఒక్కరూ పాల్గొని మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు సాయిబాబా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ

## అక్రమ మైనింగ్‌పై అధికారుల విచారణ

**అడ్డాకుల:** మండలంలోని కందూర్ సమీపంలో వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద అక్రమ మైనింగ్‌పై అధికారులు విచారణ చేపట్టారు. ఆలయం వెనుక ఉన్న గుట్టల్లో ఇటీవల కొందరు నాయకులు మైనింగ్ చేయించి రాళ్లను లారీల్లో తరలిస్తున్నారు. బీజేపీ నాయకులు గురువారం మైనింగ్ లోడుతో వెళ్తున్న లారీని అడ్డగించి అధికారులకు అప్పగించారు. తహసీల్దార్ శేఖర్ గనులశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న లారీని శుక్రవారం మైనింగ్ శాఖకు చెందిన ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. లారీలో ఉన్న రాళ్ల కొలతలను తీసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. లారీని తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకెళ్లి పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు. మైనింగ్‌కు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు అందజేసి వారి సూచన ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా బిల్లు ఇవ్వరా?

- హౌసింగ్ అధికారులను నిలదీసిన లబ్ధిదారు
- ఎండీకి నివేదించామని బదులిచ్చిన వైనం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** 'ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా.. కనీసం మొదటి విడత బిల్లు కూడా ఇవ్వకపోతే ఎలా?..' అని ఓ లబ్ధిదారు ఏకంగా హౌసింగ్ అధికారులను నిలదీసింది. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సింహగిరికి చెందిన బి.పార్వతికి గత ఆగస్టులో ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అందుకు సంబంధించిన పత్రాలు సైతం అధికారుల నుంచి అందుకుంది. దీంతో ఆమె తమ సొంత ప్లాటులో గుంతలు తీసి బేస్‌మెంట్ సైతం పూర్తి చేసి బిల్లు కోసం అధికారులకు మొరపెట్టుకున్నా ఇంతవరకు రాకపోవడంతో ఖంగు తింది. కాగా, శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వచ్చిన విషయం తెలుసుకుని అక్కడికి కుటుంబ సభ్యులతో కలిసి చేరుకుంది. అప్పుడే బయటకు వచ్చిన హౌసింగ్ డీఈఈ విజయకుమార్, ఏఈ కొర్ర రవిలకు తమ సమస్యను విన్నవించారు. అందుకు వారు బదులిస్తూ 'మీ అత్త రామాపురం పద్మమ్మ 2008లోనే అప్పటి ఇందిరమ్మ పథకంలో లబ్ధి పొందినందున ఇప్పుడు బిల్లు ఆగిపోయింది..' అని వివరించారు. ఆ వెంటనే పద్మమ్మ మాట్లాడుతూ అప్పట్లో తనకు ఎలాంటి పథకం మంజూరు కాలేదన్నారు. ఎవరో నా పేరిట రూ.53 వేల బిల్లు ఎత్తుకుని ఉంటారని పేర్కొంది. తమకు వెంటనే న్యాయం చేయకపోతే హౌసింగ్ కార్యాలయానికి పురుగు మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు. ఇదే విషయమై అక్కడే ఉన్న డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీకి, హౌసింగ్ అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే జోక్యం చేసుకుని లబ్ధిదారు సమస్యను త్వరగా పరిష్కరించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించగా ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎండీకి పూర్తి నివేదిక పంపించామని బదులు చెప్పడం గమనార్హం.

## రూ.220 కోట్లతో కొత్త పైపులైన్

- నాసిరకం పనులతోనే నీటి కష్టాలు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** నగర పరిధిలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడి తీర్చేందుకు రూ.220 కోట్లతో కొత్త పైపులైన్లు వేయిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గతంలో చేపట్టిన నాసిరకం పనులతోనే మిషన్ భగీరథ పథకం పైపులైన్లు ఎక్కడికక్కడ పగిలిపోతున్నాయన్నారు. నగరంలో పెరుగుతున్న జనాభా, నీటి వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం కొత్త బస్టాండు సమీపంలో ఉన్న ఏకైక ఓపెన్ వెల్ ద్వారానే అత్యవసర సమయాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నందున కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనిని అధిగమించేందుకు నగరంలో నలువైపులా నీటి స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముందుగా వీరన్నపేటలో ఒకటి ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.30 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. గతంలో కంటే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు సీజే బెన్‌హర్, ఖాజాపాషా, అంజద్, ప్రవీణ్‌కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ టీచర్ మృతి



కొండయ్య (ఫైల్)

**గండేడ్:** మండలంలోని కొంరెడ్డిపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్ కుడుముల కొండయ్య మృతి చెందాడు. రెడ్డిపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఆయన గతేడాది ఉద్యోగ విరమణ పొందారు. పదిహేను రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్సకు రూ.3లక్షల దాకా ఖర్చయింది. ఏడాదైనా రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో మిగతా ట్రీట్‌మెంట్‌కు డబ్బులు లేక ఇంట్లోనే ఆక్సిజన్ పెట్టుకుని చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం ప్రతికల్లో రావడంతో కలెక్టర్ ఆదేశం మేరకు ఆర్డీఓ, డీఎంహెచ్‌ఓ, స్థానిక అధికారులు కొండయ్యను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అదేరోజు రూ.9లక్షలు తర్వాత మిగతా డబ్బులు వచ్చినా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

**ఇది ప్రభుత్వ హత్యే..**

కొండయ్య అనారోగ్యంతో మృతి చెందడానికి ప్రభుత్వమే కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములు, మండల నాయకుడు లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం గండేడ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కొండయ్య ఆయన కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

## హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

**గండేడ్:** మండలంలోని వెన్నాచేడ్ హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామానికి హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికిగాను రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఇన్నాళ్లు స్థలం కారణంగా జాప్యమైంది. అయితే గ్రామస్తులంతా కలిసి క్లబ్ స్థలంలో కట్టాలని తీర్మానించారు. దీంతో పాడుబడ్డ పాతభవనాన్ని తొలగించి స్థలాన్ని చదును చేశారు. ఈ మేరకు నిర్మాణపు పనులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, గ్రామపాలన అధికారి శ్రీనివాసులు, ఏపీఓ హరిశ్చంద్రుడు, టీటీఏ, శ్రీనివాస్, రిటైర్డు టీచర్లు రాములుగౌడ్, నరేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో అడ్డుకొని బంద్‌కు మద్దతివ్వడం బీజేపీ నాటకం



**మహబూబ్‌నగర్ న్యూటౌన్:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లు బిల్లును కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటూనే బందుకు మద్దతిస్తున్నట్లు నాటకాలాడటం ఎంతవరకు సమంజసమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం తీరును వ్యతిరేకిస్తూ బందు నిర్వహిస్తే తామంతా పాల్గొంటామని, లేదంటే మండలాలు, పట్టణాల్లో బీజేపీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్‌కుమార్, గాలెన్న, ప్రశాంత్, భరత్ పాల్గొన్నారు.

## పీయూ ఎల్‌ఎల్‌ఎంలో మొదటి అడ్మిషన్

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** పాలమూరు యూనివర్సిటీలో ఇటీవల ప్రారంభించిన లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎం మొదటి సంవత్సరంలో మొదటి అడ్మీషన్‌ను రవీందర్ అనే విద్యార్థి పొందారు. ఈ మేరకు ఆర్డర్ కాపీని కళాశాల ప్రిన్సిపాల్ మాళవి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భూమయ్య, అడిట్‌సెల్ కోర్డినేటర్ రవికుమార్ పాల్గొన్నారు.

## కరాటేకు ఎదిర విద్యార్థులు



**మహబూబ్‌నగర్ క్రీడలు:** జడ్చర్ల పట్టణంలో ఈనెల 19వ తేదీన జరిగే జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా 22వ నేషనల్ లెవల్ వీబీపీ చాలెంజ్ కప్‌లో ఎదిర జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నట్లు సీనియర్ మాస్టర్ సత్యనారాయణ తెలిపారు. పోటీల్లో పవన్, ఈశ్వర్, అంకిత్, చరణ్, శృతి, శివాణి, రిషి, పూజ, జ్యోత్స్న, మంజుల, భరత్ పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులను జీహెచ్‌ఎం హేమచంద్రుడు అభినందించారు. కరాటే పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పీడీ పరశురామ్, కరాటే మాస్టర్ సత్యనారాయణ, రాజు, కర్నే సురేశ్, స్కూల్ చైర్మన్ సరోజనమ్మ పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి

**స్టేషన్ మహబూబ్‌నగర్:** సమాజంలో విద్యాభివృద్ధికి సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ ఎనలేని కృషి చేశారని ఆల్ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ జయంతి నిర్వహించారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖుబ్, షేక్ మహమూద్, మహెబూబ్‌అలీ పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలి

**జడ్చర్ల టౌన్:** వరిధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వానకాలం సీజన్ పంటలు దిగుబడి వచ్చాయని, అకాల వర్షాలు వచ్చినందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తడిసి ముద్దవుతుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరిపడా హమాలీలు ఉండేలా చూడాలని, డ్రయర్లు ప్రతిసెంటర్‌లో ఉంచాలని, కొత్త బస్తాలను ఉంచాలన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, పారుఖ్, కృష్ణయ్య, మురళికృష్ణ, శేఖర్‌రెడ్డి, మోహన్‌నాయక్, రాములు పాల్గొన్నారు.

## కోర్టుకు హాజరైన ఎంపీ మల్లురవి

**జడ్చర్ల టౌన్:** 2017లో పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో శుక్రవారం నాగర్‌కర్నూలు పార్లమెంట్‌సభ్యుడు డా. మల్లురవి జడ్చర్ల అదనపు కోర్టుకు హాజరయ్యారు. ఆయనతోపాటు మరో 9మంది కేసులో హాజరయ్యారు. వివరాలిలా.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017 ఆగస్టు 28న అఖిలపక్షం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి శుక్రవారం వాయిదా ఉండటంతో ఆయన కోర్టుకు హాజరయ్యారు. ఆయనతోపాటు పాలాది రాంమోహన్, నిత్యానందం, నందకిశోర్‌గౌడ్, రాంప్రసాద్, ఖాజా, ఖయ్యూం, నరేష్, శ్రీను, హుమాయున్‌లు ఉన్నారు. కేసు విచారణ నవంబర్ 21కు వాయిదా పడిందని న్యాయవాది మాలిక్‌షాకీర్ తెలియజేశారు.

## తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా

**మహబూబ్‌నగర్ రూరల్:** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పైన జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ ఘాన్సీరామ్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గండేడ్:** జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు మెమోరండం అందజేశారు. ఉమ్మడి జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు